క్లుప్తంగా

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం


భీమవరంలో డాక్టరేట్ గ్రహీత ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన బొబ్బిళ్లపాటి ప్రసాద్ ఇటీవల పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు. కాగా ఆదివారం రాత్రి డాక్టర్ ప్రసాద్ దంపతులను గ్రామస్తులు, పలువురు నాయకులు శాలువలతో ఘనంగా సత్కరించారు. గ్రామానికి పేరు తెచ్చిన ప్రసాద్‌ను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు, నాయకులు దోమందల శ్యాముల్, కోట లోకేశ్వరరావు, బొబ్బిళ్లపాటి బాబురావు, రమేష్, కోటేశ్వరరావు, రాజారావు, సునీల్, రత్నబాబు, సందీప్, వెంకటేష్, శ్రీనివాసరావు, పిచ్చియ్య, హేమలత, సత్యాలు, ఏబు, చక్రవర్తి పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు

మధిర: మధిర పట్టణంలో నిర్వహిస్తున్న మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల కేంద్రంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఖమ్మంకు చెందిన కొండపల్లి రవి, రూపారాణి కుమార్తె శ్రావ్య పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగులకు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని మానసిక వికలాంగుల కేంద్రం నిర్వాహకులు నల్లపు స్వర్ణలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక దివ్యాంగులకు అన్నదానం చేసిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అన్ని దానాల కంటే అన్నదానం మిన్న అని అన్నారు. దివ్యాంగులకు అన్నదానం చేసే దాతలు 8328226423 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దుస్తులు వితరణ


దుస్తులు అందజేస్తున్న కొండయ్య

మధిర: మధిర పట్టణంలోని ఆజాద్ రోడ్‌లో ప్రముఖ సామాజిక సేవకుడు, లంకా సేవా ఫౌండేషన్ నిర్వాహకుడు లంకా కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంక్‌కు ఆదివారం పలువురు దాతలు పాత దుస్తులను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా లంకా కొండయ్య మాట్లాడుతూ.. అనేకమంది గృహాల్లో అవసరానికి మించి దుస్తులు ఉంటాయన్నారు. వాటిని సేకరించి తమ సంస్థ ద్వారా పేదలకు అందజేయడం జరుగుతుందన్నారు. మానవ సేవయే మాధవ సేవగా భావించి ప్రతి ఒక్కరు తమ ఇంట్లో అదనంగా ఉన్న దుస్తులు, ఉపయోగంలో లేని దుస్తులు ఓల్డ్ క్లాత్ బ్యాంక్ కు అందిస్తే అవి మరొకరికి ఉపయోగపడతాయని తెలిపారు. మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ నిరుపయోగంగా ఉన్న పాత దుస్తులను వితరణ చేయాలని కోరారు.

నేడు పెట్రోల్ బంక్ ప్రారంభం

వేంసూరు: వేంసూరు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నాబార్డు నిధులతో నిర్మించిన పెట్రోల్ బంక్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి సోమవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనునట్లు సొసైటీ చైర్మన్ తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పుచ్చాకాయల సోమిరెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు కాసరి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం


నిరుపేద కుటుంబానికి నగదు అందజేస్తున్న పోలీసులు

తల్లాడ: మండలంలోని మల్లవరం గ్రామంలోని పోలీసులు ఆదివారం నిరుపేద కుటుంబానికి రూ.35 వేలు ఆర్థిక సాయం అందించారు. గ్రామంలో శెట్టిపల్లి కృష్ణయ్య ఇటీవల మృతి చెందగా కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని గమనించిన గ్రామానికి చెందిన యువ పోలీసులు తమకు తోచిన రీతిలో విరాళాలు సేకరించి రూ.35 వేలు అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

- డ్రెయినేజీలు అస్తవ్యస్తం
- పల్లెలు దుర్గంధభరితం
- స్పందించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


వల్లబిలో పేరుకుపోయిన చెత్తా చెదారం


చిరుమర్రిలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పక్కనే పేరుకుపోయిన మురుగు

ముదిగొండ: మండలంలోని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం పడకేసింది. డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా మారాయి. పల్లెలు దుర్గంధభరితమయ్యాయి. దోమలు అధికం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో 33గ్రామాలకు గానూ.. 58వేల జనాభా కలిగి ఉన్నారు. సీజనల్‌గా వస్తున్న వ్యాధులకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించడంలో అధికారులు విఫలం చెందుతున్నారు.

ప్రజారోగ్యంపై అధికారుల సలహాలు..

మండలంలోని వల్లబి, ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వాటిలోని వైద్య ఆరోగ్య సిబ్బంది నిత్యం గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఎప్పటికప్పుడు వ్యాధుల బారిన పడకుండా ఇంటింటికీ వెళ్లి సలహాలు, సూచనలు చేస్తున్నారు.

సక్రమంగా లేని నిర్వహణ..

గ్రామ పంచాయతీల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మురుగు కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించే వారే కరువైయ్యారు. కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదని వాపోతున్నారు. గ్రామాల్లోని సేకరించిన చెత్తాచెదారాన్ని తగలబెడుతున్నారు. వర్మికంపోస్టుగా చేసే విధానం మరచిపోయారు. కమలాపురం, వల్లబి, బాణాపురం, వల్లాపురం గ్రామాల్లోని డంపింగ్‌యార్డుల్లో చెత్తను తగలపెట్టడంతో సమీపంలోని జనాలు ఆవాసనను భరించలేకపోతున్నామని చెపుతున్నారు. వల్లబి, గోకినేపల్లిలోని వసతి గృహాల సమీపంలో ఉన్న మురుగుకాలువలతో దోమల వలన ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

రోడ్లపై మురుగునీరు


సైడ్ డ్రెయిన్లలో పెరిగిన తీగ

తల్లాడ: మండలంలోని కలకొడిమ పంచాయతీలో డ్రెయినేజీ సరిగా లేక మురుగునీరు రహదారులపై నిలుస్తుంది. సైడ్ డ్రెయిన్లు ఉన్నా వాటిని శుభ్రం చేసే నాథుడు లేడు. దీంతో చెత్తా చెదారం అడ్డుపడి మురికి నీరు పారుదల లేక మురుగు పేరుకు పోయి దుర్వాసన వస్తుంది. దోమలు చేరి రోగాలకు నిలయంగా మారింది. గ్రామంలోని పలు రోడ్లలోని డ్రెయినేజీలు, పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది.

అప్రమత్తంగా ఉండాలి..



సీజనల్‌గా వస్తున్న వ్యాధులకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తరచూ జ్వరాలు వస్తుంటే వైద్యులను సంప్రదించాలి. రక్త పరీక్షలు చేయించుకోవాలి. వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్న వారిని సంప్రదించాలి.

– ఊరుకొండ అరుణాదేవి, ముదిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారిణి

పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతున్నారు..



గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణతో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య నిర్వహణ చేపడపతున్నారు. మా దృష్టికి వస్తే వెంటనే చర్యలు చేపడతాం. ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు. ఇంటింటి సర్వేల్లో ఉన్నందున కొంత లోపం ఉండవచ్చు. సమస్యలు లేకుండా చూస్తాం.

– శ్రీధర్‌స్వామి, ఎంపీడీఓ, ముదిగొండ

విద్యుత్ బిల్ కలెక్టర్లను ప్రభుత్వం ఆదుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న రాష్ట్ర, జల్లా నాయకులు, బిల్ కలెక్టర్లు

తల్లాడ: ఐదునెలలుగా ఉపాధిలేక అవస్థలు పడుతున్న విద్యుత్ బిల్ కలెక్టర్లను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణా స్టేట్ యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలగాని రమేష్ అన్నారు. ఆదివారం తల్లాడలో బోడపట్ల కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యుత్ బిల్ కలెక్టర్ల సమావేశం ఆయన మాట్లాడారు. విద్యుత్ బిల్లులు వసూలు చేసేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కమిషన్ పద్ధతిలో 70 మంది పని చేస్తున్నారని, గృహజ్యోతి పథకం వల్ల వీరంతా గత ఐదు నెలలుగా కమిషన్ లేక ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 80శాతం జీరో బిల్లు రావటంతో విద్యుత్ బిల్ కలెక్టర్లకు వచ్చే కమిషన్ రావటం లేదన్నారు. దీంతో వారు ప్రభుత్వానికి పలుమార్లు యూనియన్ తరపున విన్నవించుకున్నట్లు తెలిపారు. ఆగస్టు 1 నుంచి యాజమాన్యం క్యూఆర్ కోడ్ స్కాన్ అమల్లోకి తెస్తుందని, దీని వల్ల పట్టణ ప్రాంతాల్లో పని చేస్తున్న బిల్ కలెక్టర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. జీవో నం 11 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం న్యాయం చేయకపోతే హైదరాబాద్ కేంద్రంగా ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో స్తంభాద్రి ఎలక్ట్రిసిటీ మ్యూచువల్ ఎయిడ్ కాంట్రాక్ట్ లేబర్ సొసైటీ మేనేజర్ ఎన్‌జీవీ నాగేశ్వరరావు, డైరెక్టర్స్ నగేష్, సత్యనారాయణ, శ్రీను, రాజశేఖర్‌రెడ్డి, గుర్నాథం, రాంబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న యూనిట్ అధ్యక్షుడు కేశవరెడ్డి

సత్తుపల్లి: పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వనమారెడ్డి చెంచిరెడ్డి, యూనిట్ అధ్యక్షుడు కేశవరెడ్డిలు కోరారు. సత్తుపల్లిలోని సంఘ భవనంలో ఆదివారం జరిగిన యూనిట్ స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు, డీఏలు, హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల సాధన కోసం సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందిస్తామన్నారు. ఈ సమావేశంలో యూనిట్ ప్రధాన కార్యదర్శులు బద్రూద్దీన్, అద్దంకి వెంటరత్నం, కృష్ణయ్య, మధుసూదన్‌రాజు, సాంబశివరెడ్డి, సుహాసిని, వాణి పాల్గొన్నారు.

ప్రారంభానికి ముస్తాబైన దర్గా



తల్లాడ: ఈ నెల 9న తల్లాడలో పీర్ల చావడి దర్గా ప్రారంభానికి ముస్తాబైంది. వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన పీర్ల చావడి దర్గాను ఈ ఏడాది నూతన హంగులతో నిర్మించారు. ప్రతి ఏటా ముస్లీం సోదరులు ఇక్కడ పీర్ల పండుగను వైభవంగా జరుపుకుంటారు. పది రోజుల పాటు డప్పు, వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, కోలాటం నృత్యాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయి. 9న ఉదయం 8:56 నిముషాలకు దర్గాను ప్రారంభించేందుకు ముస్లిం కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తల్లాడలోని పాత తహసీల్ సమీపంలో దర్గాను అందంగా తీర్చిదిద్దారు. అదే రోజు మహా అన్నదానం నిర్వహిస్తున్నట్లు పీర్ల ముజావర్ సదర్ షేక్ ఈసూబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

కారేపల్లి: రైతులు తమ పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలని కారేపల్లి సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం (సొసైటీ)లో రుణాలు పొందిన 3,790 మంది రైతులకు సంబంధించి రూ.19.26కోట్లకు ప్రభుత్వానికి రుణమాఫీ జాబితాను పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా కారేపల్లి సొసైటీలో యూరియాతోపాటు, 20–20–0–13, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డుతో నేరుగా సొసైటీ కార్యాలయానికి వచ్చి ఎరువులు కొనుగోలు చేసుకోవచ్చునని ఆయన వివరించారు.

ఉద్యోగం నుంచి తొలగించాలి

పెనుబల్లి: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి కారకులైన వారిని ఉద్యోగం నుంచి తొలగించాలని మాలమహానాడు జాతీయ కార్యదర్శి మేకతొట్టి కాంతయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సై మృతికి కారుకులైన సీఐ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుల్స్ సన్యాసి నాయుడు, శేఖర్, సుభాని, శివనాగరాజు, నాగరాణిలను ఉద్యోగం నుంచి తొలగించి, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన ఎస్సై శ్రీనివాసులు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీకి ఎంపిక


పీఈటీ కృష్ణయ్యతో విద్యార్థినులు తనూశ్రీ , కీర్తి

ముదిగొండ: రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఫుడ్‌బాల్‌కి మండలంలోని మేడేపల్లి జెడ్పీఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపిక అయినట్లు ఆదివారం పీఈటీ బియ్యాని కృష్ణయ్య తెలిపారు. వెంకటాయపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో ఆదివారం నిర్వహించిన ఫుడ్‌బాల్ పోటీల్లో మేడేపల్లి విద్యార్థినులు తనూశ్రీ , కీర్తిలు గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కాపర్ వైర్ చోరీ

కొణిజర్ల: మండలంలోని ఉప్పలచలక వ్యవసాయ భూములలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోకి కాపర్ వైర్ ఎత్తుకెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, విద్యుత్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ సిబ్బంది ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఉప్పల చలకలో విద్యుత్ సరఫరా రాకపోవడంతో సిబ్బంది పరిశీలించగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి వాటిలోని కాపర్ వైరు తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు సమాచారం అందించి.. కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని: మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన మొగిలి నరేష్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులపై ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుగ్గిరాల తిరుపయ్య, అతని కుమారుడు నరేష్‌పై పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని మొగిలి నరేష్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు శనివారం సాయంత్రం దాడి చేసి గాయపరిచారు. దీనితో తిరుపయ్య, నరేష్‌లకు తీవ్ర గాయాలు కావటంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తిరుపయ్య మరో కుమారుడు ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

పగడాల పాపయ్యకు దయాకర్‌రెడ్డి పరామర్శ


పాపయ్యను పరామర్శిస్తున్న తుంబూరు దయాకర్‌రెడ్డి

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పగడాల పాపయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఆదివారం పగడాల పాపయ్యను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పెనుబల్లిలో దయానంద్..

పెనుబల్లి: మండలంలో పలువురిని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. పెనుబల్లి గ్రామానికి చెందిన గోదా రత్నం ఇటీవల మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీయంబంజర్‌కు చెందిన రిపోర్టర్ మీరా తండ్రి సీలార్ , కాంగ్రెస్ నాయకుడు గోనినేని రమేష్ తండ్రి గణపతిరావు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్, వెంకటేశ్వరరావు, మాధవరెడ్డి, దామోదర్, కాంతయ్య, నిరంజన్, వెంకటేశ్వరరెడ్డి, చెన్నారావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అలనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఏన్కూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 35 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు పలకరించుకొని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్య నేర్పిన గురువులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ఏలూరి కృష్ణమూర్తి, గోగినేని వెంకటేశ్వరావు, సూరి, అనంతరం రామయ్య పాల్గొన్నారు.

సామాజిక సేవే లక్ష్యంగా వైరా లయన్స్‌క్లబ్


నూతన లయన్స్‌క్లబ్ చైర్మన్ వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: సామాజిక సేవే లక్ష్యంగా వైరా లయన్స్‌క్లబ్ పని చేస్తుందని ఇప్పటి గత 18 ఏళ్లలో దాదాపు రూ.4 కోట్లకు పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించారని లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ అన్నారు. ఆదివారం వైరాలోని కమ్మవారి కల్యాణ మండపంలో లయన్స్‌క్లబ్ వైరా 19వ ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కాపా మురళీ కృష్ణ మాట్లాడుతూ.. నిరుపేద మహిళలు, విద్యార్థులు, అభాగ్యులను ఆదుకోవడానికి క్లబ్ ముందుందన్నారు. వేసవిలో మీల్స్ ఆన్ వీల్స్ పేరుతో అన్నదానం చేసినట్లు తెలిపారు. అనంతరం 19వ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా చింతలపూడి వెంకటేశ్వరరావు చేత ఇమీడియట్ పాస్ట్ గవర్నర్ సీహెచ్‌వీ శివప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నిరుపేద మహిళలకు కుట్టుమిషన్‌లు, దివ్యాంగుడికి వీల్‌చెయిర్ అందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్, కోచైర్మన్ డాక్టర్ పెరుమాళ్ల కృష్ణమూర్తి, జీఎస్‌టీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, రీజియన్ చైర్మన్ దేవరొట్టి పూర్ణ చందర్‌రావు, జోన్ చైర్మన్లు పెనుగొండ ఉపేందర్‌రావు, ఉంద్రు వరలక్ష్మి, మాదినేని సునీత, వనమా విశ్వేశ్వరరావు, ఏపూరి రాజారావు, చింతోజు నాగేశ్వరరావు, హనుమాయమ్మ, సీత, నీరజ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం


మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

బోనకల్: మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. 100మందికి ప్రముఖ వైద్యుడు సాయికుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సాయికుమార్ మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు తూము రోషన్‌కుమార్, సీపీఐ నాయకులు తోట రామాంజనేయులు, యంగల ఆనందరావు, ఆకెన పవన్, ఏలూరి పూర్ణచంద్, కృష్ణ పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన ఆదివారం స్థానిక ప్రశాంతి సేవా నిలయంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుపతయ్య రోగులను పరీక్షించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ వెంకట్రామారావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, వర్ధిని, సురేష్‌కుమార్, అబీదాబేగం, తనూజ, భక్తులు పాల్గొన్నారు.

పదోన్నతి బాధ్యత పెంచుతుంది


లక్ష్మీపతిని సన్మానిస్తున్న ఎస్సై, సిబ్బంది

పెనుబల్లి: ఉద్యోగ జీవితంలో పదోన్నతి మరింత బాధ్యత పెంచుతుందని వీయంబంజర్ ఎస్సై కె.వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం వీయంబంజర్ పోలీస్‌స్టేషన్‌లో.. కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది భద్రాద్రికొత్తగూడెం వెళ్తుండడంతో లక్ష్మీపతిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈయన వీయంబంజర్‌లో గత ఆరు సంవత్సరాలుగా కానిస్టేబుల్‌గా పనిచేశారు. కార్యక్రమంలో ఏఎస్సై సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, పెంటయ్య, కానిస్టేబుళ్లు సురేష్, రాజమల్లు, హోంగార్డు జానీ తదితరులు ఉన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

పెనుబల్లి: అడవిమల్లేల ప్రాథమికోన్నత పాఠశాలలో గత 8 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను గ్రామస్తులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఆదివారం పాఠశాల ఆవరణలో.. ఉపాధ్యాయుడు మధు, ఉపాధ్యాయురాలు సునీతలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్‌కుమార్, రమేష్, ఆనందరావు, రామకృష్ణ, శేఖర్‌రావు, ప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నరసింహారావు తదితరులు ఉన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షుడిగా బయ్యారపు నరేంద్ర


ఉపాధ్యక్షుడిగా ఎనుముల రాము

కల్లూరు: జాతీయ బీసీ సంక్షేమ సంఘం కల్లూరు పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి లింగనబోయిన పుల్లారావుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా బయ్యారపు నరేంద్ర, ప్రధాన కార్యదర్శిగా ఎనుముల రాము, ఉపాధ్యక్షుడిగా లింగాల మారేష్ (నారాయణ), నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కల్లూరు పట్టణానికి చెందిన ఆళ్లకుంట నరసింహారావును, కమిటీ సభ్యులుగా బొడ్డు పిచ్చయ్య, చిత్రాల వెంకటరాజులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

సొసైటీ డైరెక్టర్‌ను పరామర్శించిన కూనంనేని


లక్ష్మీనారాయణతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుగులోతు వెంకటలక్ష్మీనారాయణను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదివారం రాత్రి పరామర్శించారు. లక్ష్మీనారాయణ గత కొద్ది రోజులుగా అనారోగ్యం బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో కూనంనేని ఆయన ఆరోగ్య పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర నాయకుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా నాయకులు ఎర్రా బాబు, దొండపాటి రమేష్, నాయకులు తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం 30వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. అంబేద్కర్, జగ్జీవన్‌రావు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. జాతికోసం ఆవిర్భవించిన ఉద్యమం అనేక వర్గాల ప్రజల కోసం కులమతాలకు అతీతంగా పని చేస్తుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు


కొణిజర్లలో..


బోనకల్‌లో..


కారేపల్లిలో..